మనం
హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్
శనివారం | 13 | జూన్ | 2026 పేజీలు: 9



# భారీ వర్షం

## చల్లబడ్డ వాతావరణం



మేడ్చల్, జూన్ 12 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం అంతా సుర్రు నా కాలే ఎండలతో అవస్థలు పడ్డ జనాలు వర్షం కురవడం.. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశ్రమమం పొందారు. బహుదూర్ పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్ , తూం కుంట శామీర్పేట్, అలియాబాద్ ప్రాంతాలలో వర్షం కురిసింది.

# మేం లోకల్... మాకు నిబంధనలా..

**నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ భవన నిర్మాణాలు**

**చర్యలకు వెనుకాడుతున్న అధికారులు**

**ఒక్క అక్రమ భవనానికి నోటీసులు ఇస్తే ఒట్టు**

3

మేడ్చల్, జూన్ 12 ( మనం జిల్లా ప్రతినిధి) :

మేము లోకల్.. మాకు నిబంధనలు ఏంటి.. మమ్మల్ని ఎవరు ఆపుతారు అంటూ మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధి గుండ్ల పోచంపల్లి డివిజన్ మైసమ్మగూడ తీరు ఇది. ఇక్కడ స్థానికులు జోరుగా అక్రమ భవన నిర్మాణాలు చేపడుతూ హాస్టల్స్ నిర్వహణకు అద్దెకిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు అన్న విమర్శలు ఉన్నాయి. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతుండడంతో పుట్టగొడుగుల్లా అక్రమ భవన నిర్మాణాలు వెలుస్తున్నాయి. అనుమతులు ఒక రకంగా పొంది నిర్మాణాలు మరో రకంగా చేపడుతూ మేము లోకల్... మా ఇష్టం ఉన్నట్లు మేము కట్టుకుంటాం.. మమ్మల్ని ఎవరు ఆపేది అంటూ జోరుగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి.







2

## రైల్వే సరుకు రవాణాలో కొత్త అధ్యాయం

హైదరాబాద్ డివిజన్లో సరుకు రవాణాకు కొత్త ఊపు.. వెల్దుర్తి నుంచి ఉక్కు ఉత్పత్తులు, జానకం పేట్ నుంచి మొక్కజొన్న రవాణా ప్రారంభం..

## మేడ్చల్ ప్రజల రుణం తీర్చుకుంటా

**తక్కువ ఖర్చుతో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తా: ఎమ్మెల్యే మల్లారెడ్డి**

2




## నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు

రూ.30 లక్షల విలువైన విత్తనాలు, ప్యాకెట్ల స్వాధీనం..




8

# మేం లోకల్... మాకు నిబంధనలా..

**నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ భవన నిర్మాణాలు**
**చర్యలకు వెనుకాడుతున్న అధికారులు**
**ఒక్క అక్రమ భవనానికి నోటీసులు ఇస్తే ఒట్టు**





మేడ్చల్, జూన్ 12 ( మనం జిల్లా ప్రతినిధి) : మేము లోకల్.. మాకు నిబంధనలు ఏంటి.. మమ్మల్ని ఎవరు ఆపుతారు అంటూ మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధి గుండ్ల పోచంపల్లి డివిజన్ మైసమ్మగూడ తీరు ఇది. ఇక్కడ స్థానికులు జోరుగా అక్రమ భవన నిర్మాణాలు చేపడుతూ హాస్టల్స్ నిర్వహణకు అద్దెకిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు అన్న విమర్శలు ఉన్నాయి.

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతుండడంతో పుట్టగొడుగుల్లా అక్రమ భవన నిర్మాణాలు వెలుస్తున్నాయి. అనుమతులు ఒక రకంగా పొంది నిర్మాణాలు మరో రకంగా చేపడుతూ మేము లోకల్... మా ఇష్టం ఉన్నట్లు మేము కట్టుకుంటాం.. మమ్మల్ని ఎవరు ఆపేది అంటూ జోరుగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. జి ప్లస్ టు అనుమతులు తీసుకొని మరో నాలుగు అంతస్తులు కడుతూ అధికారులకు సవాల్ విసురుతున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్న సంబంధిత అధికారులు అక్రమ కట్టడాల జోలికి మాత్రం వెళ్లడం లేదు.

**ఒక్క భవనానికి నోటీసు ఇచ్చిన దాఖలాలు లేవు**

గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని మైసమ్మగూడలో ఒకరు కడుతున్నారంటూ మరొకరు అక్రమ నిర్మాణాలు చేపడుతూ.. ఊరు నిండా అక్రమ నిర్మాణాలు చేపట్టిన ఒక్క భవనానికి అధికారులు నోటీసులు ఇచ్చిన దాఖలాలు లేవు. అంటే ఇక్కడ పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

**సమగ్ర విచారణ జరపాలి**

గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధి మైసమ్మగూడలో సాగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు జిల్లా కలెక్టర్ ను కోరుతున్నారు. అనుమతులు ఒక రకంగా పొందే నిర్మాణాలు మరో రకంగా చేపడుతున్న చర్యలు తీసుకోకపోవడం పై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు. ఆకాశాన్ని అంటుతున్న అక్రమ నిర్మాణాల పై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను కోరుతున్నారు.

# మేడ్చల్ ప్రజల రుణం తీర్చుకుంటా

**తక్కువ ఖర్చుతో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తా: ఎమ్మెల్యే మల్లారెడ్డి**




మేడ్చల్, జూన్ 12 (మనం జిల్లా ప్రతినిధి ): పేద మధ్యతరగతి విద్యార్థులకు కూడా అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందించడమే తన జీవిత ఆశయ మని మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు.. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్, మేడ్చల్ డివిజన్ పరిధిలోని సరస్వతి నగర్లో నూతనంగా ఏర్పాటు చేసిన 'మల్లారెడ్డి పాఠశాల'ను ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో భారీ మెజారిటీతో గెలిపించిన మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని నియోజకవర్గ ప్రజల, వారి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకే వరుసగా పాఠశాలలు, కళాశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆర్థిక స్థోమత లేక ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతోనే, అతి తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్యను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ విద్యాసంస్థ ప్రారంభోత్సవ వేడుకలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, ఎల్లంపేట మున్సిపల్ చైర్ పర్సన్ లావుడియా శ్రీదేవి రమేష్ నాయక్, మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి వీరితో పాటు ఎల్లంపేట, అలియాబాద్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీలకు చెందిన మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




# రైల్వే సరుకు రవాణాలో కొత్త అధ్యాయం

**హైదరాబాద్ డివిజన్లో సరుకు రవాణాకు కొత్త ఊపు..**
**వెల్దుర్తి నుంచి ఉక్కు ఉత్పత్తులు, జానకం పేట్ నుంచి మొక్కజొన్న రవాణా ప్రారంభం..**

సికింద్రాబాద్, జూన్ 12 (మనం న్యూస్) దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని హైదరాబాద్ డివిజన్ సరుకు రవాణా రంగంలో మరో కీలక ముందడుగు వేసింది. సరుకు రవాణా వ్యాపారాన్ని విస్తరించడంతో పాటు కొత్త రవాణా మార్గాలను అభివృద్ధి చేసే క్రమంలో వెల్దుర్తి, జానకం పేట్ రైల్వే స్టేషన్ల నుంచి తొలిసారిగా కొత్త సరుకుల రవాణా ప్రారంభమైంది. ఈ చర్యలతో పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు కొత్త అవకాశాలు ఏర్పడటంతో పాటు రైల్వే ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. వెల్దుర్తి రైల్వే స్టేషన్లో ప్రత్యేక కంటైనర్ టెర్మినల్ను ఏర్పాటు చేసి, సమీపంలోని ఉక్కు పరిశ్రమల్లో ఉత్పత్తి అవుతున్న పిగ్ ఐరన్, టీఎంటీ స్టీల్ బార్లతో కూడిన తొలి కంటైనర్ రేక్ను లోడ్ చేస్తున్నారు. ఈ రేక్లను ఢిల్లీ, పంజాబ్, ముంబై, గుజరాత్ వంటి దేశంలోని ప్రధాన పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాలకు తరలించేందుకు ప్రణాళిక రూపొందించారు. వెల్దుర్తి టెర్మినల్ ప్రారంభంతో ఇనుము, ఉక్కు ఉత్పత్తుల రవాణా మరింత సమర్థవంతంగా, వేగవంతంగా, వ్యయ ప్రయోజనాలతో కూడిన విధంగా సాగనుంది. పరిశ్రమలకు దేశవ్యాప్తంగా ఉన్న మార్కెట్లతో మెరుగైన అనుసంధానం కల్పించడంలో ఈ టెర్మినల్ కీలక పాత్ర పోషించనుంది. ఇదే సమయంలో జానకం పేట్ రైల్వే స్టేషన్లో కూడా సరుకు రవాణా కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. స్టేషన్ నుంచి 21 కవర్డ్ వ్యాగన్లతో కూడిన తొలి 'మినీ రేక్'లో మొక్కజొన్నను లోడ్ చేసి మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్కు తరలిస్తున్నారు. ఈ సౌకర్యం ద్వారా తెలంగాణ రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో, భద్రంగా, నమ్మకమైన రీతిలో రైలు మార్గం ద్వారా ఇతర రాష్ట్రాలకు పంపే అవకాశం లభించనుంది. ముఖ్యంగా మహారాష్ట్రలోని మరాఠ్వాడా ప్రాంతంలో ఆహార ధాన్యాల అవసరాలను తీర్చడంలో ఈ రవాణా కీలకంగా మారనుంది. దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, కొత్త సరుకులను రైల్వే నెట్వర్క్కు అనుసంధానం చేయడం ద్వారా సరుకు రవాణా వ్యాపారాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో వివిధ పారిశ్రామిక సంస్థలు, వ్యవసాయ ఉత్పత్తిదారులతో సమన్వయం చేస్తూ కొత్త లోడింగ్ పాయింట్లను అభివృద్ధి చేస్తున్నారు.




దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ హైదరాబాద్ డివిజన్ చేసిన కృషిని అభినందించారు. జోన్ పునర్వ్యవస్థీకరణ అనంతరం కూడా సరుకు రవాణా లోడింగ్ను మరింత పెంచేందుకు ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. కొత్త ట్రాఫిక్ను ఆకర్షించడం ద్వారా దక్షిణ మధ్య రైల్వే సరుకు రవాణా విభాగం మరింత బలోపేతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.




# పేదలకు ఓ న్యాయం... ఉన్నవారికో న్యాయమా...

డిప్యూటీ కమిషనర్ గారు ఎందుకు ఇంత వ్యత్యాసం

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి అంటూ స్థానికుల డిమాండ్



మేడ్చల్, జూన్ 12 ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో ఉన్నవారికో న్యాయం.. పేదవారికో న్యాయం అన్నట్టుగా పాలన సాగుతుంది. రోడ్డు పైన చిన్నచితక చాయ్ డబ్బాలు.. షాప్ లో ముందున్న రేకులను తొలగించే జిహెచ్ఎంసి అధికారులు. డబ్బులు ఉన్నవారు కట్టే అక్రమ కట్టడాల వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యత్యాసం మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో జోరుగా వినిపిస్తుంది. ముఖ్యంగా గుండ్ల పోచంపల్లి డివిజన్ కార్యాలయంలో ఈ వ్యత్యాసం ఎక్కువగా ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల డివిజన్ కార్యాలయం ముందున్న చాయ్ డబ్బాలను, షాపుల ముందు ఎండ తగలకుండా వేసుకున్న రేకులను బలవంతంగా తొలగించారు. అదే ఉత్సాహం అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై ఎందుకు చూపడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇవిగో ఇవి అక్రమ కట్టడాలు అంటూ సాక్ష్యాలతో అధికారుల దృష్టికి తీసుకెళ్లిన అధికారులు వాటి జోలికి వెళ్లడం లేదని విమర్శలు ఉన్నాయి. దీని వెనుక కారణాలేంటో అధికారులకే తెలవాలి అంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. కనీసం వీటికి నోటీసులు ఇచ్చే తీరిక కూడా అధికారులకు లేదని ఆరోపణలు ఉన్నాయి.

**ఈ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవు**

గుండ్ల పోచంపల్లి డివిజన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో నిర్మిస్తున్న ఓ అక్రమ కట్టడానికి ఎలాంటి అనుమతులు లేవని తెలుస్తుంది. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ దాని వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పూర్తిస్థాయి టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడం వల్ల అక్రమ నిర్మాణ దారులు బరితెగిస్తున్నారు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోనీ డిప్యూటీ కమిషనర్ అయినా ఏమైనా చర్యలు తీసుకుంటారా అంటే అది కూడా లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.





# రాజకీయాలే కాదు.. క్రికెట్ కూడా ఆడొచ్చు



**అని నిరూపించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి**

మేడ్చల్, జూన్ 12 ( మనం జిల్లా ప్రతినిధి ): రాజకీయాలే కాదు.. తనకు క్రికెట్ కూడా ఆడవచ్చు అని నిరూపించారు ఎమ్మెల్యే మల్లారెడ్డి. మేడ్చల్ జిల్లా శామీర్పేటలో ఏర్పాటు చేసిన మల్లారెడ్డి పాఠశాలను ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి క్రికెట్ ఆడి సందడి చేశారు. బ్యాటింగ్ చేస్తూ విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గం ప్రజలు తనను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించారని, వారికి కృతజ్ఞతగా వారి పిల్లలకు తక్కువ ఫీజుతో కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలని ఉద్దేశంతో నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఒక సీఎంఆర్ పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చే తక్కువ ఫీజులోనే కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ప్రస్తుత యువత ను సక్రమార్గంలో నడిపే బాధ్యత తల్లిదండ్రులపై ఉందని, భవిష్యత్తులో యువత కు మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడమే మల్లారెడ్డి ఆశయమని పేర్కొన్నారు.

# 5 జి తో విస్తృతంగా బిఎస్ఎన్ఎల్ సేవలు



చేవెళ్ల, జూన్ 12(మనం న్యూస్): చేవెళ్ల పార్లమెంటు పరిధిలో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ మంజూరు చేసిన 7 బి ఎస్ ఎన్ ఎల్ సెల్ టవర్ల సత్వర నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోనున్నట్లు చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు శ్రీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రసార మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి. భాస్కర రావు, డిజిఎం అశోక్, లక్ష్మణ్ కుమార్, గణేష్ తదితరులు ఎంపీ తో సమావేశమై బిఎస్ఎన్ఎల్ సెల్ఫోన్ టవర్ల విషయమై చర్చించారు. దాదాపు 14 కోట్ల వ్యయంతో ఈ ఏడు సెల్ ఫోన్ టవర్లు త్వరలోనే నిర్మాణం ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. మారుమూల ప్రాంతాలలో నెట్వర్క్ సమస్యలు ఉన్న గ్రామాలను గుర్తించి సత్వరమే ఇక చర్యలు తీసుకొని నెట్వర్క్ సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి వారిని కోరారు. తన విజ్ఞప్తి మేరకు చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఏడు సెల్ ఫోన్ టవర్లు మంజూరు చేసిన కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా, బిఎస్ఎన్ఎల్ తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ రత్నకుమార్, హైదరాబాద్ టెలికం అధికారులకు ఎంపీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# అమరుల స్ఫూర్తితో.. ప్రజా సాంస్కృతికోద్యమానికి కొత్త సంకల్పం

**పాట, డప్పు, నాటకాలతో కళాకారుల్లో నూతన ఉత్సాహం**

**అమరుల స్ఫూర్తితో ప్రారంభమై శ్రామిక గీతంతో ముగిసిన శిబిరం**

**సమాజ మార్పుకు కళలు, సాహిత్యం శక్తివంతమైన సాధనాలు: వక్తలు**

చేవెళ్ల,జూన్ 12(మనం న్యూస్ ): ప్రజల జీవితాలతో మమేకమైన కళలు, సాహిత్యం సమాజ మార్పుకు శక్తివంతమైన ఆయుధాలనే సందేశంతో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (అఇఊ) నిర్వహించిన రెండు రోజుల సాంస్కృతిక శిక్షణా శిబిరం విజయవంతంగా మొయినాబాద్ లోని ఓ దగ్గర ముగిసింది. జూన్ 11, 12 తేదీల్లో జరిగిన ఈ శిబిరాన్ని విమలక్క ప్రారంభించగా, తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కళాకారులు, సాంస్కృతిక కార్యకర్తలు పాల్గొన్నారు.





ప్రజా సాంస్కృతికోద్యమ కర్తవ్యాలు, శాస్త్రీయ సోషలిజం, ఆదివాసీ కళలు-సాహిత్యం, సాంస్కృతిక ఆధిపత్య సిద్ధాంతం వంటి అంశాలపై ప్రముఖ మేధావులు, ఉద్యమకారులు లోతైన చర్చలు నిర్వహించారు. డప్పు భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన డప్పు శిక్షణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాట, నాటకం, డప్పు వంటి ప్రజా కళారూపాలను సమకాలీన ప్రజా సమస్యలతో అనుసంధానిస్తూ సాంస్కృతికోద్యమాన్ని మరింత విస్తరించాల్సిన అవసరాన్ని వక్తలు నొక్కిచెప్పారు. రెండు రోజుల పాటు జరిగిన చర్చలు, శిక్షణా తరగతులు, సాంస్కృతిక ప్రదర్శనలు కళాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

ప్రజల పక్షాన నిలిచే సాంస్కృతిక శక్తుల ఐక్యత, చైతన్యం, కార్యాచరణకు ఈ శిబిరం వేదికగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. అంతర్జాతీయ శ్రామిక గీతంతో శిబిరం ఉత్సాహభరితంగా ముగిసింది.

# కాప్రా చెరువు, చర్లపల్లి చెరువు పరిసరాల్లో ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం..

**- చెత్తను చెరువుల్లో వేయవద్దని ప్రజలకు అవగాహన.**
**- జలవనరులు, జంతుజాలం పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి**




కాప్రా, జూన్ 12 (మనం న్యూస్): ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో కాప్రా చెరువు, చర్లపల్లి చెరువు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం పారిశుద్ధ్య సిబ్బంది, స్థానిక ప్రజలు కలిసి శ్రమదానం ద్వారా విస్తృత స్థాయిలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్ మాట్లాడుతూ చెరువులు వంటి జలవనరులు కాలుష్యానికి గురికాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. చెత్తాచెదారాన్ని చెరువుల్లో లేదా వాటి పరిసర ప్రాంతాల్లో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

చెరువుల పరిశుభ్రత వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు జంతుజాలం, జలచరాల సంరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు. గృహాల నుంచి వచ్చే చెత్తను తప్పనిసరిగా మున్సిపల్ ఆటో సిబ్బందికే అందించాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సానిటరీ జవాన్లు రామకృష్ణ, శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డికి వినతి

**జూలపల్లి సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్ గ్రామస్తులతో కలిసి వినతిపత్రం**



(తలకొండపల్లి జూన్12/మనం న్యూస్) : కడ్తాల్ మండల పరిధిలోని ఎస్.ఎల్.ఆర్ గార్డెన్స్లో శుక్రవారం కల్వకుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కాసిరెడ్డి నారాయణరెడ్డికి జూలపల్లి గ్రామ సర్పంచ్ శ్రీ కడారి శేఖర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి, గ్రామానికి సంబంధించిన పలు కీలక సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్ మాట్లాడుతూ జూలపల్లి గ్రామం నుండి చంద్రధాన వెళ్లే రహదారి అధ్వాన్నంగా తయారైందని, ప్రయాణికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ రోడ్డు నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా,జూలపల్లి గ్రామంలో గత 6 సంవత్సరాలుగా సీలింగ్ భూములు లాక్ అయ్యి ఉండటం వల్ల స్థానిక ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఈ భూ సమస్యను పరిష్కరించి, తక్షణమే అన్లాక్ చేసేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్తో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## సీఎంను కలిసిన తలకొండపల్లి మాజీ మండల అధ్యక్షుడు గుజ్జల మహేష్

(తలకొండపల్లి జూన్12/ మనం న్యూస్): శుక్రవారం నాడు మీర్ఖాన్ పేట్ భారత్ ఫ్యూచర్ సిటీలో ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ ఆఫ్ అథారిటీ) నూతన భవన నిర్మాణ ప్రారంభ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్ తదితర





## జర్నలిస్టుల పిల్లల చదువుల ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వాలి

**టిడబ్ల్యూజేఎఫ్ డిమాండ్**

మేడ్చల్, జూన్ 12 ( మనం జిల్లా ప్రతినిధి): ప్రైవేట్ పాఠశాలలు జర్నలిస్టుల పిల్లల చదువు కోసం ఫీజులో 50% రాయితీ ఇవ్వాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో మాయొక్క జర్నలిస్టుల పిల్లలకు 2026-27 సంవత్సరాలకు ఫీజుల్లో 50% రాయితీ ఇవ్వాలని కోరుతూ జిల్లా విద్యాధికారి కి వినతిపత్రం అందజేశారు. టిడబ్ల్యూజేఎఫ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి గడ్డమీది అశోక్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు దామర జగదీశ్వర్ గుప్తా, ఏ గోవిందరావు లు మాట్లాడుతూ.... మేడ్చల్ జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టుల పిల్లలకు ప్రతి విద్యా సంవత్సరం మాదిరిగా ప్రైవేట్ పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం మన జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 80 శాతం జర్నలిస్టులు వేతనాలు లేక నెలవారీ ఆదాయం లేక తమ పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు ఫీజులు కట్టలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరాల్లో ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50% ఫీజు రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక రాయితీ అమలు చేయాలని సూచించారు చేస్తున్నాం. రాబోయే 2026-27 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేనాటికి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా జీవో/సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ జేఎఫ్ నాయకులు శివకుమార్, వీరేష్ ముదిరాజ్, సంజీవ్ కుమార్, శ్యాం ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## బూత్ లెవెల్ ఏజెంట్లకు శిక్షణ శిబిరం

**పాల్గొన్న డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్**

మేడ్చల్, జూన్ 12 ( మనం జిల్లా ప్రతినిధి ): మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు (బి ఎల్ ఎ ) కోసం ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) కార్యక్రమంపై అవగాహన కల్పించడం లక్ష్యంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నియమించిన ప్రత్యేక ట్రైనర్ల ద్వారా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బి ఎల్ ఎ ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. సర్ కార్యక్రమానికి సంబంధించిన నిబంధనలు, విధివిధానాలు, ఓటర్ల వివరాల పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పులు వంటి అంశాలపై బి ఎల్ ఎ లకు సమగ్ర అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి బూత్లో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంలో బి ఎల్ ఎ లు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బి ఎల్ ఎ లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# వర్షాకాలానికి ఎంఎంసి సంసిద్ధం

**నాలాలు, వరద కాలువలపై కమిషనర్ ప్రత్యేక దృష్టి..**





సికింద్రాబాద్, జూన్ 12 (మనం న్యూస్) మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) వర్షాకాల సన్నద్ధత చర్యలను ముమ్మరం చేసింది. భారీ వర్షాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, రహదారులపై నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం శారదానగర్, దిల్సుఖ్నగర్, గడ్డిఅన్నారం, సరూర్నగర్ చెరువు, విజయపురి కాలనీ, రామకృష్ణాపురం ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి వర్షాకాల సన్నద్ధత పనులను పరిశీలించారు. దిల్సుఖ్నగర్ శారదానగర్లో వరద నీటి కాలువలు, అండర్గ్రౌండ్ డ్రైనేజీ అనుసంధాన వ్యవస్థను పరిశీలించిన కమిషనర్, వర్షపు నీరు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాలాల శుభ్రత పనులు వేగవంతం చేయడంతో పాటు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. గడ్డిఅన్నారం ప్రాంతంలో నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి డీ-సిల్టింగ్ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. సరూర్నగర్ చెరువు వద్ద ఇన్ఫ్లో, అవుట్ఫ్లో కాల్వలను పరిశీలించి, చెరువు నిండిన సమయంలో అదనపు నీరు కాలనీలు, రహదారులను ప్రభావితం చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దిల్సుఖ్నగర్ మెయిన్ రోడ్డులో వర్షపు నీటి పారుదల వ్యవస్థను సమీక్షించిన కమిషనర్, మెట్రో కారిడార్లకు అనుసంధానమైన ప్రధాన రహదారులపై నీరు నిల్వ కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. విజయపురి కాలనీ, రామకృష్ణాపురం ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలను గుర్తించి నీటి నిల్వలు, వరద ముప్పు నివారణకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా దోమల నివారణ చర్యలను సమీక్షించిన ఆయన, ఫాగింగ్, యాంటీ-లార్వల్ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు, డీఆర్ఎఫ్ బృందాలు పాల్గొన్నారు.



# యువకుడు అదృశ్యం.. కేసు నమోదు

సికింద్రాబాద్, జూన్ 12 (మనం న్యూస్) పద్మారావు నగర్కు చెందిన టి. రాహుల్ ప్రభు (23) అనే యువకుడు అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చిలకలగూడ ఇన్స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బి.కాం మొదటి సంవత్సరం చదువుతున్న రాహుల్ ప్రభు జూన్ 5న ఉదయం ఇంటి నుంచి టిఫిన్ తీసుకురావడానికి వెళ్తున్నట్లు చెప్పి బయటకు వెళ్లాడు. అనంతరం తల్లికి ఫోన్లో స్నేహితులతో ఉన్నానని, తర్వాత ఇంటికి వస్తానని తెలిపాడు. అయితే అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాహుల్ ప్రభు ఆచూకీ తెలిసిన వారు చిలకలగూడ పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని ఇన్స్పెక్టర్ రామకృష్ణ కోరారు.



# మెట్టుగూడ సిమెంట్రీలో కూలిన చెట్టు తొలగింపు



సికింద్రాబాద్, జూన్ 12 (మనం న్యూస్) సికింద్రాబాద్లోని మెట్టుగూడ సిమెంట్రీ ప్రాంగణంలో భారీ చెట్టు కూలిపోవడంతో అక్కడికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ విషయాన్ని సిమెంట్రీ ఇన్చార్జి పీటర్, పారిష్ కౌన్సిల్ సభ్యుడు ఆదం సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆదం సంతోష్, సికింద్రాబాద్ జిల్లా అధికార ప్రతినిధి కే. శిల్పాచారి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. కే.ఎస్ శిల్పాచారి వెంటనే మెట్టుగూడ సిమెంట్రీని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి, ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. శిల్పాచారి విజ్ఞప్తికి స్పందించిన అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని కూలిపోయిన చెట్టును తొలగించారు. చెట్టు తొలగింపుతో సిమెంట్రీలో రాకపోకలు సజావుగా సాగుతున్నాయి. సమస్యను వెంటనే గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పీటర్, ఆదం సంతోష్, అలాగే వేగంగా స్పందించి పరిష్కారానికి కృషి చేసిన కే. శిల్పాచారి, సంబంధిత అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు తక్షణ స్పందన చూపడం అభినందనీయమని పేర్కొన్నారు.





# కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి

**- ఎన్టీఏను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్**

చేవెళ్ల, జూన్ 12(మనం న్యూస్): జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల్లో చోటుచేసుకుంటున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ మంగళవారం ఓ ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)పై విద్యార్థులు, తల్లిదండ్రులు విశ్వాసం కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. ఎన్టీఏను రద్దు చేసి వైద్య ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని కోరారు. రీ-నీట్ పరీక్ష నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడితే, దానిని సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర సంస్థతో నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని, లేకుంటే దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఎంతో సర్పంచ్ మేరిగే భారతమ్మ

(తలకొండపల్లి జూన్12/మనం న్యూస్) : ₹ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసిన₹ సర్పంచ్ మేరిగే భారతమ్మ ,యువ నాయకుడు తడిసిన ప్రదీప్ రెడ్డి రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామానికి చెందిన వంగూరు సువర్ణ ,వంగూరు నిర్మలమ్మ ఇరువురు అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొంది ముఖ్యమంత్రి సహాయనిధి కోసం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు తడిసిన ప్రదీప్ రెడ్డికి హాస్పిటల్ పేపర్స్ ఇవ్వడంతో వారు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి అందజేయడంతో శుక్రవారం ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారు రాళ్లు వంగూరు సువర్ణ 50000 -00 రూపాయలు వంగూరు నిర్మలమ్మ 22000-00 వేల చెక్కులను గ్రామ సర్పంచ్ మేరిగే భారతమ్మ గోపాల్ ముదిరాజ్, యువ నాయకుడు తడిసిన ప్రదీప్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తడిసిన సుమతమ్మ, కాలే మహేష్ తడసిన చంద్రశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఉపసర్పంచ్ ,శ్రీని వాస్ రెడ్డి గ్రామస్తులు టి రామచంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు



# ఓయూలో ఉపాధి ఉత్సవం.. విద్యార్థులకు ఉద్యోగాల వరం

**ఉస్మానియా విద్యార్థుల ఉద్యోగ విజయాలకు వేదికగా హెచ్సీడీసీ..**

**80 మంది విద్యార్థులకు నియామక పత్రాల అందజేత..**









సికింద్రాబాద్, జూన్ 12 (మనం న్యూస్) ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని మానవ వనరుల వికాస కేంద్రం (హెచ్సీడీసీ) నిర్వహించిన ఉద్యోగ ఎంపికల విజయ సమ్మేళనం 2025-26 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన సుమారు 80 మంది విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రో. కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు నైపుణ్యాలు కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. మానవ వనరుల వికాస కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తు దోహదపడుతున్నాయని అభినందించారు. విద్యార్థులు నిరంతర అభ్యాసాన్ని అలవర్చుకొని కొత్త విషయాలను తెలుసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ జి. విజయ చరణ్ మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనలో హెచ్సీడీసీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు మృదు నైపుణ్యాలు, సాంకేతిక నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణలు అందిస్తున్నామని తెలిపారు. గత ఏడాదిలో 'చక్కగా మాట్లాడటం', 'ఐఈఎల్టీఎస్ పరీక్షలో విజయం', 'అంకగణితం-తార్కిక ఆలోచన', 'పోటీ పరీక్షల సామర్థ్యాభివృద్ధి', 'అజేయమైన మనస్తత్వం', 'పరిశోధనా ధోరణి' వంటి పది ధ్రువీకరణ శిక్షణా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ విద్యావకాశాలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన విదేశీ విద్యా సదస్సుకు 800 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. 40కి పైగా విదేశీ విశ్వవిద్యాలయాలు పాల్గొని ఉన్నత విద్యా కోర్సులు, స్కాలర్షిప్లు, విదేశీ విద్యా అవకాశాలపై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశాయని వెల్లడించారు. అదనంగా సీపీఆర్, మహిళల ఆరోగ్య సంరక్షణ వంటి అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహించినట్లు వివరించారు. ఈ సందర్భంగా మానవ వనరుల వికాస కేంద్ర కార్యాచరణ పుస్తకం 2025-26ను ఉపకులపతి ఆవిష్కరించారు. సింజీన్ ఇంటర్నేషనల్లో రూ.4.42 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం పొందిన పి. శివాని, రెసొనెన్స్లో రూ.3.60 లక్షల ప్యాకేజీతో ఎంపికైన పి. ఆకాష్లు తమ విజయానికి హెచ్సీడీసీ అందించిన శిక్షణే ప్రధాన కారణమని పేర్కొన్నారు.

## నిషేధిత జాబితా పేరుతో రిజిస్ట్రేషన్లలో అక్రమాలు?

**- బ్రోకర్లు, డాక్యుమెంట్ రైటర్ల ప్రమేయంపై విమర్శలు?**

**- లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నారన్న బాధితుల ఆరోపణలు?**

**- రిజిస్ట్రేషన్ వ్యవహారాలపై సమగ్ర విచారణకు డిమాండ్?**



కాప్రా సర్కిల్, జూన్ 12 (మనం న్యూస్): కాప్రా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిషేధిత జాబితా (ప్రొహిబిటెడ్ లిస్ట్) పేరుతో రిజిస్ట్రేషన్లలో అక్రమాలు జరుగుతున్నాయంటూ పలువురు బాధితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. నిషేధిత జాబితాలో ఉన్నాయని, లేదా ఆ జాబితాతో సంబంధం ఉందని పేర్కొంటూ కొన్ని సర్వే నంబర్ల భూముల యజమానులను భయభ్రాంతులకు గురిచేసి, మధ్యవర్తులు (బ్రోకర్లు), డాక్యుమెంట్ రైటర్ల ద్వారా భారీ మొత్తాల్లో డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి? కష్టార్జితంతో కొనుగోలు చేసిన స్థలాలను కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు లేదా కుమార్తెల వివాహాల కోసం విక్రయించాలనుకున్నప్పుడు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు చెల్లించకపోతే రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తున్నారని, అదే సమయంలో మధ్యవర్తుల ద్వారా వ్యవహారాలు నడిపితే నిషేధిత భూములుగా పేర్కొన్న ఆస్తులకే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు.

ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, గత ఏడాది నుంచి ఇప్పటివరకు కాప్రా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్లను పరిశీలించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఇన్స్పెక్టర్ జనరల్, సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ జరపాలని బాధిత ప్రజల విజ్ఞప్తి..

## ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీవిద్యను కేంద్రాలను వెంటనే రద్దు చేయాలి

**వాటిని అంగన్వాడీలకు అప్పజెప్పాలి**




మేడ్చల్, జూన్ 12 ( మనం జిల్లా ప్రతినిధి ): ప్రీ ప్రైమరీ,పీఎం శ్రీవిద్య కేంద్రాలను అంగన్వాడీలకే అప్పచెప్పాలని వాటిని ప్రత్యేకంగా నిర్వహించే పద్ధతిని ప్రభుత్వం మానుకోవాలని తెలంగాణ అంగనవాడి టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి పి శివరాణి డిమాండ్ చేశారు. అల్వాల్ మండల ఆఫీస్ వద్ద అంగన్వాడీ టీచర్స్ అండ్ యూనియన్ నాయకత్వంలో ధర్నా నిర్వహించి ఎమ్మార్వో కు వినతి పత్రాలు అందజేశారు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రేణుక అధ్యక్షత ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివరాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన విద్య విధానంలో భాగంగా అంగన్వాడీల కేంద్రాలకు ఎసురు పెట్టే కార్యక్రమానికి పూనుకొన్నదని విమర్శించారు.

అందులో భాగంగా ప్రీ ప్రైమరీ స్కూల్ ను, పిఎం శ్రీ విద్యను ప్రవేశపెడుతున్నారని అన్నారు.అంగన్వాడీలకు నష్టం కలిగించే ప్రీ ప్రైమరీ స్కూల్ పి.ఎం.శ్రీ విద్యను గ్రామములో అమలు చేయమని వాటిని అంగన్వాడీ లకు అప్పుజెప్పాలని కోరుతూ తీర్మాణం చేసి రాష్ట్ర ప్రభుత్వం పంపాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం పాటించడం దారుణమని విమర్శించారు. ప్రీ ప్రైమరీ మరియు పీఎం శ్రీ కేంద్రాలను అంగనవాడలకే అప్పచెప్పుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. 30 నుండి 40 సంవత్సరాలగా సేవలందిస్తున్న అంగన్వాడి టీచర్లకు మరియు హెల్పర్లకు ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ప్రీ ప్రైమరీ పాఠశాలలతో వారి ఉద్యోగాల ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు ప్రమాదంగా మారిన ప్రీ ప్రైమరీ ,పి.ఎం.శ్రీ 4,131 కేంద్రాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు శిల్ప, పుణ్యవతి, వరలక్ష్మీ,తదితరులు పాల్గొన్నారు.



# సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ వద్దు.. గుడ్డ జనప నార సంచు లు ముద్దు




మేడ్చల్, జూన్ 12 ( మనం జిల్లా ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ), ప్రాంతీయ కార్యాలయం, మేడ్చల్ ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్కు నో చెప్పండి - గుడ్డ  జనపనార సంచుల వినియోగాన్ని ప్రోత్సహించండి అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సు కు విశేష స్పందన లభించింది. జీడిమెట్ల ఇండస్ట్రియల్ అసోసియేషన్ (జేఐఏ) సమావేశ మందిరంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వివిధ ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు, వ్యాపారులు, దుకాణదారులు మరియు ఇతర భాగస్వాములు పాల్గొన్నారు. ఈ సదస్సులో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే వ్యూహాలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్కు (ఎస్యూపీలు) పర్యావరణహిత ప్రత్యామ్నాయాల వినియోగం, పునర్వినియోగం,




పునఃచక్రీకరణ, పునరుద్ధరణ  సుస్థిర వినియోగ విధానాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ చర్యల ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు సహజ వనరుల సంరక్షణ సాధ్యమవుతుందని వివరించారు. భవిష్యత్ తరాల కోసం సహజ వనరులను పరిరక్షించడం, ప్రజారోగ్యాన్ని కాపాడడం అత్యంత అవసరమని చెప్పారు. అదేవిధంగా, వాయు, నేల మరియు జల కాలుష్యానికి సంబంధించిన పర్యావరణ సమస్యలపై చర్చించారు.




ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవగాహన ప్రదర్శన స్టాల్సు ఏర్పాటు చేసి క్రింది అంశాలను ప్రదర్శించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్కు పర్యావరణహిత ప్రత్యామ్నాయాలు. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాల ప్రకారం సూచించిన నాలుగు రకాల రంగు-గుర్తింపు చెత్త సేకరణ బిన్లు.ప్రదర్శించిన సమాచారంప

పాల్గొన్నవారు ఆసక్తి కనబరిచి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్కు ప్రత్యామ్నాయాల అవసరం, వాటి వినియోగ ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణలో వాటి ప్రాధాన్యత, అలాగే రంగు-గుర్తింపు ఆధారిత వ్యర్థాల వర్గీకరణ విధానం గురించి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ జనపనార సంచులు పంపిణీ చేశారు.

## ఆన్‌లైన్ విద్యాభివృద్ధికి సీఈసీ కృషి అభినందనీయం: ఓయూ వీసీ

**విద్యా ప్రసార మాధ్యమాల్లో ఈఎంఆర్సి సేవలు అభినందనీయం..**
**ఉచిత ఆన్లైన్ కోర్సుల ప్రాధాన్యతపై అవగాహన..**

సికింద్రాబాద్, జూన్ 12 (మనం న్యూస్) ఉన్నత విద్యా రంగంలో డిజిటల్ విద్యను మరింత బలోపేతం చేయడానికి కన్సార్టియం ఫర్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్ (సిఈసి) చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం పేర్కొన్నారు. జూలై-2026 విద్యా సెషన్కు సంబంధించిన ఆన్లైన్ కోర్సులపై అవగాహన కల్పించే ఉద్దేశంతో సీఈసి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎడ్యుకేషనల్ మల్టీమీడియా రీసెర్చ్ సెంటర్ (ఈఎంఆర్సి) సహకారంతో శుక్రవారం ఆన్లైన్ సదస్సును నిర్వహించింది. సదస్సుకు హాజరైన అధ్యాపకులను ఉద్దేశించి సిఈసి జాయింట్ డైరెక్టర్ మాట్లాడుతూ, సంస్థ చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, స్వయం (ఖిగిఇ్గఅక) ఆన్లైన్ కోర్సులు, స్వయం ప్రభ (ఖిగిఇ్గఅక ౖఖఅఆఏఅ) విద్యా ప్రసారాల లక్ష్యాలను వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో డిజిటల్ వేదికల ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రసంగించిన వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, జూలై-2026 సెషన్ కోసం రూపొందించిన ఆన్లైన్ కోర్సుల అభివృద్ధి, ప్రచారంలో సీఈసి చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం సిఈసి బృందం ఉచిత ఓపెన్ ఆన్లైన్ కోర్సుల ప్రాముఖ్యత, వాటి విస్తృత వినియోగం, ఆధునిక ఉన్నత విద్యలో వాటి అవసరంపై సమగ్ర ప్రదర్శన ఇచ్చింది. తదుపరి నిర్వహించిన చర్చా కార్యక్రమంలో అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని ఆన్లైన్ విద్యా వేదికలు, విద్యారంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం, వాటి వల్ల కలిగే అవకాశాలు, సవాళ్లపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. విద్యా రంగంలో సాంకేతికత పాత్ర మరింత విస్తరిస్తోందని పేర్కొన్నారు. అనంతరం ఈఎంఆర్సి డైరెక్టర్ పి. రఘుపతి మాట్లాడుతూ, విద్యా ప్రసార మాధ్యమాలు, డిజిటల్ కంటెంట్ అభివృద్ధిలో ఈఎంఆర్సి చేస్తున్న సేవలను వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు ఆన్లైన్ విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## మంజీరా వాటర్ పైప్‌లైన్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



సికింద్రాబాద్, జూన్ 12 (మనం న్యూస్) ప్రజల అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం పద్మారావు నగర్ లో 40 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన మంజీరా వాటర్ పైప్ లైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనత్ నగర్ నియోజకవర్గం లో 2014 తర్వాతనే బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కోట్లాది రూపాయల విలువైన అనేక అభివృద్ధి పనులు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో సరైన రోడ్లు ఉండేవి కాదని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక రోడ్లపై మురుగునీరు ప్రవహించేదని చెప్పారు. తాను ఎమ్మెల్యే గా వచ్చిన తర్వాత అన్ని రోడ్లను ఎంతో అభివృద్ధి చేశామని, డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించామని తెలిపారు. ప్రజల త్రాగునీటి అవసరాలను తీర్చేందుకు అనేక ప్రాంతాలలో నూతన పైప్ లైన్ ల ఏర్పాటు, రిజర్వాయర్ ల నిర్మాణం చేసిన విషయాన్ని వివరించారు. తాను నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. సనత్ నగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి లో ఆదర్శంగా నిలిపేలా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, నాటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ల సహకారంతో ఎంతో కృషి చేశామని అన్నారు. కార్యక్రమంలో వాటర్ వరక్స్ డిజిఎం వెంకట్ రెడ్డి, పద్మారావు నగర్ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, బన్సీలాల్ పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, వాటర్ వరక్స్ మేనేజర్ శ్రీనివాస్, జీహెచ్ఎంసి ఏఈ మురళి, ఎలెక్ట్రిసిటీ ఏఈ రాజు, హార్టికల్చర్ అధికారి సత్యనారాయణ, నాయకులు లక్ష్మీపతి, ఏసూరి మహేష్, అంబులెన్స్ సురేష్, బాల్ రెడ్డి, ప్రేమ్, శ్రీకాంత్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మహేందర్ గౌడ్, పుశ్యంత్ రెడ్డి, కుషాల్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్ ఎమ్మెల్యే పీఏ ఆలేటి రమేష్కు ఘన జన్మదిన శుభాకాంక్షలు

**శాలువాతో సత్కరించి అభినందించిన బీఆర్ఎస్ నాయకులు**

కుషాయిగూడ, జూన్ 12 (మనంన్యూస్): ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి పీఏ ఆలేటి రమేష్ జన్మదినం సందర్భంగా శుక్రవారం పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఆలేటి రమేష్కు పుష్పగుచ్ఛం అందజేసి, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, డా. ఎ.ఎస్. రావు నగర్ డివిజన్ కార్యదర్శి పెద్దాపురం కుమార స్వామి, ఎస్.ఎ. రహీమ్, వి. మహేష్, ఎస్. శ్రీనివాస్ గౌడ్, జి. శివకుమార్, పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న 512 మంది చిన్నారులకు ఆర్పీఎఫ్ అండ

సికింద్రాబాద్, జూన్ 12 (మనం న్యూస్) దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) చేపట్టిన 'ఆపరేషన్ నన్హే ఫరిష్తే' కార్యక్రమం ద్వారా 2026 జనవరి నుంచి మే నెలల మధ్య 512 మంది చిన్నారులను విజయవంతంగా రక్షించి పునరావాసం కల్పించింది. రక్షించబడిన వారిలో 421 మంది బాలురు, 91 మంది బాలికలు ఉన్నారు. వీరిని తదుపరి సంరక్షణ కోసం బాలల సంక్షేమ కమిటీలకు అప్పగించారు. రైల్వే స్టేషన్లు, రైళ్లలో ఒంటరిగా, ఆపదలో లేదా అసురక్షిత పరిస్థితుల్లో ఉన్న చిన్నారులను గుర్తించి రక్షించడంలో ఆర్పీఎఫ్ ప్రత్యేక నిఘా నిర్వహిస్తోంది. పిల్లల రక్షణ సంస్థలతో సమన్వయం చేస్తూ తక్షణ సహాయ చర్యలు చేపడుతోంది. 2025 లో 1,622 మంది, 2024లో 1,390 మంది చిన్నారులను కూడా ఇదే కార్యక్రమం ద్వారా రక్షించినట్లు అధికారులు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆర్పీఎఫ్ సిబ్బందిని అభినందిస్తూ, ఇదే అంకితభావంతో సేవలు కొనసాగించాలని సూచించారు. రైల్వే స్టేషన్లు లేదా రైళ్లలో అనుమానాస్పద పరిస్థితుల్లో ఉన్న చిన్నారులు కనిపిస్తే వెంటనే రైల్వే హెల్ప్లైన్ 139కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.






# నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు









**రూ.30 లక్షల విలువైన విత్తనాలు, ప్యాకెట్ల స్వాధీనం..**

మేడ్చల్, జూన్ 12 ( మనం జిల్లా ప్రతినిధి ): రైతులను మోసం చేసి అక్రమ లాభాలు ఆర్జించేందుకు నకిలీ పత్తి విత్తనాలను విక్రయించేందుకు సిద్ధమైన ముఠాను మల్కాజిగిరి ఎస్వోటీ టీమ్-2, తిరుమలగిరి పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ ఆపరేషన్లో రూ.30 లక్షల విలువైన 12,800 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు, సుమారు 2,000 కిలోల అనుమానాస్పద నకిలీ విత్తనాలు, ఒక మారుతి ఈకో వాహనం, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నేరేడ్ మెట్ లోని మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కమీషనర్ బి. సుమతి మీడియాకు వివరాలు వెల్లడించారు. గుజరాత్కు చెందిన నర్మదా సాగర్ అగ్రి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తెలంగాణ మార్కెటింగ్ మేనేజర్ సోలంకే యశ్వంత్ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. న్యూ రైతు సంపద సీడ్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ యెరువ బాలశో రెడ్డి అలియాస్ శివారెడ్డి నర్మదా సాగర్ సంస్థ పేరుతో పోలి ఉండే నకిలీ ప్యాకెట్లను ముద్రించి, వాటిలో నకిలీ విత్తనాలను నింపి విక్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా బోయిన్పల్లి కూరగాయల మార్కెట్ యార్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహించిన పోలీసులు యెరువ బాలశో రెడ్డి, కపర్తి బెంజిమెన్, దొంగ శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 12,800 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు లభించాయి. విచారణలో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు యెరువ బాలశో రెడ్డి ఈ కుట్రకు పాల్పడినట్లు వెల్లడైంది. దొంగ శ్రీను రూపొందించిన డిజైన్తో మేడ్చల్ జిల్లా బహదూర్పల్లి ఐడీఏలోని ప్రింటింగ్ యూనిట్లో నకిలీ ప్యాకెట్లు ముద్రించినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం బండ్లగూడలోని కార్యాలయంలో నిల్వ ఉంచిన సుమారు 2,000 కిలోల నకిలీ విత్తనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు యెరువ బాలశో రెడ్డిపై ఇప్పటికే శాద్నగర్, రాజేంద్రనగర్, భూత్పూర్ పోలీస్ స్టేషన్లలో విత్తనాల అక్రమ వ్యాపారం, మోసం తదితర కేసులు నమోదై ఉన్నాయి. రైతుల జీవితాలను దెబ్బతీసే ఇలాంటి నకిలీ విత్తనాల వ్యాపారంపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ఈ కేసును మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, మల్కాజిగిరి జోన్ డీసీపీ శ్రీధర్, డీసీపీ (రోడ్ సేఫ్టీ) ఇన్చార్జి ఎస్వోటీ కె. మనోహర్, అదనపు డీసీపీ ఎస్వోటీ నంద్యాల నర్సింహారెడ్డి, ఎస్వోటీ మల్కాజిగిరి టీమ్-2 ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాస్, తిరుమలగిరి ఎస్హెచ్ఓ జి. నాగరాజు పర్యవేక్షణలో ఎస్వోటీ, తిరుమలగిరి పోలీసుల సంయుక్త బృందం ఛేదించింది. నకిలీ విత్తనాల ముఠాపై అప్రమత్తంగా వ్యవహరించి కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్న పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

## డీజిల్ పొదుపు ప్రతి ఉద్యోగి సామాజిక బాధ్యత: ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి







సికింద్రాబాద్, జూన్ 12 (మనం న్యూస్) టీజీఎస్ ఆర్టీసీ పై పెరుగుతున్న డీజిల్ వ్యయభారం నేపథ్యంలో ఇంధన పొదుపు ప్రతి ఉద్యోగి సామాజిక బాధ్యతగా భావించాలని సంస్థ వీసీ అండ్ ఎండీ వై. నాగిరెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్లోని బస్భవన్లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన డీజిల్ నిర్వహణ - అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభం, అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో డీజిల్ ధరలు నిరంతరం పెరుగుతున్నాయని, దీని వల్ల రవాణా రంగంతో పాటు ఆర్టీసీపై కూడా భారీ ఆర్థిక భారం పడుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే డీజిల్ వినియోగాన్ని క్రమబద్ధీకరించడం, ప్రతి లీటరు ఇంధనాన్ని పొదుపుగా వినియోగించడం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. డిపోల స్థాయిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని, వాహనాల ఫిట్నెస్ను నిరంతరం పరిశీలిస్తూ ఉత్తమ నిర్వహణ పద్ధతులను అమలు చేయాలని అధికారులకు, సాంకేతిక సిబ్బందికి సూచించారు. ఇంధన పొదుపు కేవలం విధి నిర్వహణలో భాగమే కాకుండా ప్రతి ఉద్యోగి సామాజిక బాధ్యతగా భావించాలని ఆయన అన్నారు. డీజిల్ను ఆదా చేయడం ద్వారా సంస్థ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటునందించినవారమవుతామని పేర్కొన్నారు. సదస్సులో నిపుణులు డిపోలలోని గ్రౌండ్ ట్యాంకుల నిర్వహణ, ఇంధన నిల్వలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డీజిల్ వృథాను నివారించే విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అలాగే బస్సుల డీజిల్ మైలేజీ (కిలోమీటర్లు ప్రతి లీటరుకు) పెంచేందుకు అనుసరించాల్సిన సాంకేతిక చర్యలు, గ్యారేజీల్లో వాహనాల్లో తలెత్తే లోపాలను ముందుగానే గుర్తించి పరిష్కరించే విధానాలపై సమగ్ర శిక్షణ ఇచ్చారు. ఇంధన పొదుపు ద్వారా సంస్థ ఆర్థిక స్థిరత్వాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ సదస్సు ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ సిహెచ్. వెంకన్న, ఫైనాన్షియల్ అడ్వైజర్ విజయపుష్ప, బీపీసీఎల్ తెలంగాణ హెడ్ లక్ష్మీలాల్ చౌహన్, మార్కెటింగ్ మేనేజర్ రఘునాథరావు, సీసీఎస్ ప్రభులతతో పాటు పలువురు డిప్యూటీ ఆర్ఎంలు, డిపో మేనేజర్లు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

## అత్వెల్లిలో జరిగిన దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

**ఒక నకిలీ గొలుసు, స్పెండర్ బైక్, వివో ఫోన్ స్వాధీనం**

**ఈ కేసును ఛాలెంజ్గా తీసుకొని ఛేదించిన పోలీసు**




మేడ్చల్, జూన్ 12 ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ పట్టణం అత్వెల్లి లో జరిగిన దోపిడి కేసును మేడ్చల్ పోలీసులు ఛాలెంజ్ గా తీసుకొని ఛేదించారు. ఈ కేసులో నిందితులను పట్టుకునేందుకు 100 నుండి 120 సీసీ ఫుటేజ్ లను క్షుణ్ణంగా పరిశీలించడంతోపాటు నిందితులను పట్టుకునేందుకు బీదర్ కర్ణాటక రాష్ట్రాలలో గాలించారు. ఈ దోపిడిని ఛేదించిన విధానాన్ని మేడ్చల్ ఏసిబి శంకర్ రెడ్డి వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. 2023, జూలై 29న మేడ్చల్ పట్టణం అత్వెల్లి లోని హెచ్.పీ పెట్రోల్ బంక్ నుండి కంపెనీ బస్సు దిగి మైల్ స్టోన్ వెంచర్ వైపు నడుచుకుంటూ వెళుతున్నారు. ఆ మహిళా కల్వర్టు సమీపం కు చేరుకునే సమయానికి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమెను మాటల్లో దింపారు. అదే సమయంలో మరో వ్యక్తి వచ్చి ఆమె మెడలోని అర తులం బంగారం మంగళసూత్రాన్ని లాక్కొని ద్విచక్ర వాహనంపై పారిపోయారు. ఆ వ్యక్తులు నల్లటి టీషర్టు లు ధరించి మొహాలు కప్పుకొని టోపీలు పెట్టుకున్నారని ఏసిపి శంకర్ రెడ్డి తెలిపారు. ఈ కేసును మేడ్చల్ సి పి డి సి పి సైబరాబాద్ సిసిఎస్ డీసీపీ ల మార్గదర్శకంలో బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా 100 నుండి 120 సీసీటీవీ ఫుటేజ్ లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో అనుమానితులు ఓ మోటార్ సైకిల్ పై కలిసి ప్రయాణించినట్లు, నేరం జరిగిన కొద్దిసేపటికి సంఘటన స్థలం నుండి వెళ్ళిపోతున్నట్లు గుర్తించారు. వీరి కోసం కర్ణాటకలోని బీదర్ జిల్లా జమిస్తాన్ పూర్, మహారాష్ట్రలోని హింగోలి పరిసర ప్రాంతాలలో రెక్కీ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ క్రైమ్ బృందం కుత్బుల్లాపూర్ జోన్ సిసిఎస్ బృందం జవహర్ నగర్ లో నిందితులు సమ్ షంషార్ సింగ్ అనే నిందితుడు పరారీలో ఉండగా. రూప్ సింగ్ చతుర్ సింగ్ టక్ (31) ను పట్టుకున్నామని పట్టుకున్నారు. అయినా వద్ద నుండి నకిలీ గొలుసు స్పెండర్ బైక్, ( బైక్ నెంబర్ ఏపీ 03 డబ్ల్యూ 3964 ) ను, వివో ఫోన్ ను స్వాధీనం చేసుకున్నామని ఏసిపి శంకర్ రెడ్డి తెలిపారు. ఇందులో సత్యనారాయణ తో పాటు మేడ్చల్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ కిరణ్ పాల్గొన్నారు.






# మోదీ సుపరిపాలనతోనే ‘వికసిత్ భారత్’ సాకారం

## బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు తొండ రవి

## చేవెళ్లలో ఆత్మనిర్భర్ మండల్ సమావేశం

చేవెళ్ల, జూన్ 11(మనం న్యూస్) : ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 12 ఏళ్ల సుపరిపాలన దేశంలో చారిత్రాత్మక మార్పులు తీసుకువచ్చిందని, 2047 నాటికి ‘వికసిత్ భారత్’ లక్ష్య సాధన దిశగా దేశం వేగంగా దూసుకుపోతోందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు తొండ రవి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో చేవెళ్ల మండల కేంద్రంలో ‘ఆత్మనిర్భర్ మండల్ సమావేశం’ నిర్వహించారు. ఈ సమావేశానికి తొండ రవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వ హయాంలో పేదల సంక్షేమం, జాతీయ భద్రత, డిజిటల్ విప్లవం, మౌలిక వసతుల కల్పనలో భారత్



ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందన్నారు. జన్ విశ్వాస్, వికాస్, జన్ కళ్యాణ్ స్ఫూర్తితో దేశ ప్రగతికి కొత్త దిశను నిర్దేశించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ బోర్డు మెంబర్




సామ మాణిక్య రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ శర్వలింగం, సీనియర్ నాయకులు కుంచం శ్రీనివాస్, గోటూరి శంకర్ గౌడ్, ఇంద్రసేనారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గణేష్, నరేష్, అక్షయ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



# తల్లిదండ్రులు మందలించారని బాలుడి ఆత్మహత్యాయత్నం

మేడ్చల్, జూన్ 12 ( మనం జిల్లా ప్రతినిధి): తల్లిదండ్రులు మందలించారన్నా నేపంతో ఓ బాలుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నూతనకల్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నూతనకల్ గ్రామానికి చెందిన మింటు అనే బాలుడు చెడు వ్యసనాలను అలవాటు చేసుకుంటున్నాడని ఇది పద్ధతి కాదు అంటూ తల్లిదండ్రులు మందలించినందుకు గ్రామంలోని స్మశానంలో ఉరేసుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడని స్థానికులు తెలిపారు. అటువైపు వెళ్లేవారు దీనిని గమనించి వెంటనే బాలుడిని రక్షించి 108 ద్వారా కండ్లకోయలోని సీఎంఆర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



# అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన పాత భవనాలు

## ఈ భవనాలను పరిశీలించిన హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

మేడ్చల్, జూన్, 12 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ పట్టణంలో ప్రభుత్వ పాత భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారాయని హ్యూమన్ రైడ్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపించారు. మేడ్చల్ పట్టణంలో నీ పాడుబడ్డ ప్రభుత్వం పాఠశాల భవనం తో పాటు ప్రభుత్వం వసతి గృహాలను ఫోరం ఫర్ ఆర్ టి ఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు నాచారం విజయ లక్ష్మి అద్యకషతన ఈ తనిఖీలను నిర్వహించారు. మేడ్చల్ పట్టణంలోనీ అర్జనవాడ ,రథంషాల దగ్గర లో ఉన్న, అంగన్వాడీ





ఎదురు ఉన్న పాత ప్రభుత్వం పాఠశాల భవణం లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా గా మారిందని వారు ఆరోపించారు. ఈ భవణం ఇండ్ల మధ్యలో ఉండటం వల్ల ఈప్రాంతంలో ఉన్న ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనికి తోడు ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో మద్యం బెల్ట్ షాపులు ఉన్నాయని వారు తెలిపారు. ఈ విషయంలో

సంబంధిత అధికారుల కు పలు మార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వారు ఆరోపించారు. సామాన్య ప్రజల సంక్షేమమే ఫోరం ఫర్ ఆర్ టి ఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ లక్ష్యం, అని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, రమేష్ గుప్తా, మేడ్చల్ జిల్లా, అధ్యక్షురాలు, నాచారం విజయ లక్ష్మి, యం లావణ్య, మేడ్చల్ మందల విద్యాశాఖ ప్రతినిధి శ్రీనివాస్, నర్సింహులు పటేల్, మాజీ వార్డు సభ్యులు గల్వ మహేష్ పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి ఆదర్శంగా నిలిచిన సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్

(తలకొండపల్లి జూన్12/మనం న్యూస్) : గ్రామాభివృద్ధికి ఆదర్శంగా నిలిచిన తలకొండపల్లి మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు కటికల శేఖర్ యాదవ్ గురువారం గ్రామ అభివృద్ధిలో స్వయంగా గ్రామ పంచాయతీ చెత్త ట్రాక్టర్ నడిపి చేత్తను సేకరించిన ₹సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు తలకొండపల్లి సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ గ్రామ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా,అభివృద్ధి,పరిశుభ్రతే ధ్యేయంగా సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ తన బాధ్యతను వినూత్నంగా ప్రారంభించారు.సాధారణంగా సర్పంచ్ అంటే కేవలం ఆదేశాలు ఇవ్వడమే అనుకునే తరుణంలో, ఆయన స్వయంగా పంచాయతీ చెత్త ట్రాక్టర్ నడుపుతూ గ్రామంలో వీధుల వెంబడి తిరుగుతూ చెత్తను సేకరించారు

ప్రజల్లో చైతన్యం గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత,సర్పంచిగా నేను నా బాధ్యత తీసుకున్నట్లే ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి అని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.. ప్రజల ప్రశంసలు పదవి చేపట్టిన తర్వాత హంగులు ఆర్భాటాలకు పోకుండా, క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్ పనితీరును గ్రామ ప్రజలు ప్రశంసిస్తున్నారు. భవిష్యత్తులో గ్రామాన్ని అన్ని రంగాలలో ఆదర్శంగా తీర్చిదిద్దుతనని సర్పంచ్ శేఖర్ యాదవ్ హామీ ఇచ్చారు.

